క్లుప్తంగా

ఉంగుటూరులో మంచినీటి సమస్యకు చెక్

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామ పంచాయితీలో ఇక నుంచి మంచినీరు సరఫరాకు ఇబ్బంది ఉండదని సర్పంచ్ బండారు సింధు తెలిపారు. ఇప్పటివరకూ ఉన్న పాత బోరు తరుచు రిపేర్లు రావడం నీరు గ్రామంలో సింహభాగం అందించేందుకు ఇబ్బందులు పడాల్సి వచ్చేదని వివరించారు. దాంతో గ్రామ పంచాయతీ నుంచి సుమారు లక్ష రూపాయలు వెచ్చించి కొత్త మోటారు అమర్చినట్లు పేర్కొన్నారు. ఇకనుంచి గ్రామంలో మూడొంతులు నీరందించేందుకు శివాలయం వద్ద ఉన్న ట్యాంకు నుంచి ఇబ్బందిలేకుండా సరఫరా జరుగుతుందని తెలిపారు.

నేడు ఉంగుటూరులో పింఛన్ల పంపిణీ

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో కొత్తగా 153 పెన్షన్లు మంజూరు అయ్యాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మరడ మంగరావు బుధవారం విలేకరులకు తెలిపారు. వీరికి గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఉంగుటూరు కమ్మ కల్యాణ మండపంలో జరిగే సమావేశంలో ఎమ్మెల్యే పుప్పాలవాసుబాబు చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేయడం చేస్తామని మంగరావు వివరించారు. ఎమ్మెల్యే వాసుబాబు కార్యక్రమాన్ని లబ్ధిదారులు, పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

ఆరోగ్యశ్రీ కార్డుల ఈ-కేవైసీ పూర్తి చేయాలి

పెదపాడు: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి సంబంధించిన ఈ-కేవైసీ పూర్తిచేయాలని పెదపాడు ఎంపీడీఓ ఎస్.నర్సింహమూర్తి తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెంటనే ఈకేవైసీ పూర్తి చేసేలా చూడాలన్నారు. వలంటీర్లు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా వారిని ఆదేశించాలన్నారు. ఈ విషయం మొదటి ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ పెదవేగి మండల ప్రధాన కార్యదర్శిగా స్టాలిన్



పెదవేగి: మండలంలోని నడిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గొట్టేటి స్టాలిన్‌ని మండల పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన నియామకం పత్రాలను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో కష్టపడినటువంటి కష్టాన్ని గుర్తించి అతను పార్టీకి అందించినటువంటి సేవలను అధిష్టానం పదవితో ఇచ్చిన గౌరవానికి ఆయన హర్షం వ్యక్తం చేశారు. తనను ఎంపిక చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, ఏపీ ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావుకు, మండల పార్టీ అధ్యక్షులు జానంపేట బాబుకు స్టాలిన్ కృతజ్ఞతలు తెలిపారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్



లక్ష్మీపురంలో వృద్ధురాలికి రూ 3 వేల పింఛన్ అందజేస్తున్న ఎంపీటీసీ, స్థానిక నాయకులు

పెదవేగి: పింఛన్‌ను రూ. 3 వేలకు పెంచకుంటూ పోతా అని గత ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని లక్ష్మీపురం ఎంపీటీసీ సభ్యుడు మేకా గంగాధరరావు అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా వృద్ధులకు పెంచిన పింఛన్‌ను గ్రామంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, వాలంటీర్‌లతో కలసి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ గంగాధరరావు మాట్లాడుతూ ఏపీకి సంక్రాంతి పండగ ముందుగా వచ్చిందన్నారు. కార్యక్రమంలో చోడిశెట్టి వెంకటేశ్వరరావు, గుడ్ల నాగేశ్వరావు, తాళం వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట

- రూ.2.30కోట్లతో భీమడోలు సీహెచ్‌సీ అభివృద్ధి
- రూ.1.30కోట్లతో ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు



భీమడోలులో ఉన్నత పాఠశాలలో రూ.1.3కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులు



రూ.2.30 కోట్లతో నిర్మించిన సీహెచ్‌సీలోని ఓపీ బ్లాక్

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్య రంగాల బలోపేతానికి పెద్దపీట వేస్తుంది. నాడు-నేడు మొదటి దశలో ఆసుపత్రులను, ప్రభుత్వ పాఠశాలలకు సర్వ హంగులను కల్పిస్తూ కార్పొరేట్ స్థాయి ధీటుగా వాటిని తీర్చిదిద్దుతుంది. కోట్లాది రూపాయలను వెచ్చిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆధునిక వైద్య సేవలను అందుబాటులో తీసుకుని వస్తున్న ప్రభుత్వం ఆసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పనతో పాటు నూతన భవనాలను నిర్మిస్తోంది. అదే విధంగా విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యతను అందిస్తూ కోట్లాది రూపాయలతో నూతన పాఠశాలలను నిర్మిస్తుంది. భీమడోలులోని సీహెచ్‌సీలో రూ.2.30 కోట్లతో నిర్మించిన ఓపీ బ్లాక్‌ను, భీమడోలు ఉన్నత పాఠశాలలో నా బార్డ్ నిధులు రూ.1.30 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదుల భవనాలను గురువారం ఉదయం ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభించి ప్రజలకు అంకితమిస్తారు. భీమడోలులోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రిని నాడు-నేడు మొదటి దశలో నాబార్డ్ నిధులు రూ.2.30 కోట్లతో ఓపీ (ఔట్ పెషెంట్) బ్లాక్‌ను నిర్మించారు. గత ప్రభుత్వాల హాయంలో 30 పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచినా రోగులకు అవసరమైన వైద్యులు నియమించకపోవడం, మౌలిక వసతులు కల్పించలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిని సారించింది. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రత్యేక కృషి చేశారు. దీనితో భాగంగా భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి నాబార్డ్ నిధులు రూ.2.30కోట్ల మంజూరు చేయించారు. జాతీయ, రాష్ట్రీయ రహదారులకు కూడలి ప్రాంతంగా ఉన్న భీమడోలులోని సీహెచ్‌సీ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజు రోజుకు పెరగడం, రహదారులపై ప్రమాదాల నేపథ్యంలో వచ్చే క్షతగాత్రులకు వైద్య సేవలందించేందుకు ఈ ఆసుపత్రి ప్రధాన భూమికగా నిలుస్తుంది.

ప్రత్యేకంగా నిర్మాణం

ఆస్పత్రి ఓపీ బ్లాక్‌ను ఆధునిక హంగులకు సర్వాంగ సుందరంగా నిర్మించారు. ఆసుపత్రిలో ఓపీ బ్లాక్‌లో ఉండాల్సిన అన్ని విభాగాలకు ప్రత్యేక రూములను నిర్మించారు. ఆసుపత్రిని పూర్తి స్థాయిలో అభివృద్ధితో పాటు మౌళిక వసతులు కల్పించారు. చిన్నపిల్లల వైద్యులు, ఆర్థోపెడిక్, గైనిక్, జనరల్, దంత, గుండె, దీర్ఘకాలిక వ్యాధులు, ఐసీటీసీ, మత్తు వైద్యుల విభాగాలను నిర్మించారు. ఎక్స్‌రే, ల్యాబ్‌లను సుందరంగా నిర్మించి పరికరాలు సిద్ధం చేసేలా తగు ఏర్పాట్లు చేసారు. ఆసుపత్రిలో ప్రతి రోజు 150 నుంచి 200 మందికి పైగా ఓపీ వస్తున్నారు. వారికి వైద్య సేవలందించేందుకు వివిధ విభాగాలకు చెందిన వైద్యులు విధులను నిర్వర్తించేలా వారికి ప్రత్యేక రూములను నిర్మించారు. ఆసుపత్రిలో ఓపీ బ్లాక్ ప్రారంభంతో భీమడోలు పరిసర గ్రామాలకు చెందిన రోగులు సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. వాటిని సంపూర్ణ వైద్య సేవలు అందనున్నాయి.

నాబార్డ్ నిధులతో అదనపు తరగతి భవనం

భీమడోలు ఉన్నత పాఠశాలలో 1000 మందికి పైగా బాలబాలికలు విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. ప్రస్తుతం ఇక్కడ 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. దీనితో పాటు నూతన విద్యా విధానంలో 3వ తరగతి నుంచి పై తరగతులకు చెందిన విద్యార్థులకు ఉన్నత పాఠశాలలో చదువుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు తగిన తరగతి గదులు లేనందున ప్రభుత్వం మరో 8 తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం నాబార్డ్ నిధులు రూ.1.30 కోట్ల మంజూరు చేసి సర్వ సుందరంగా నిర్మించారు.

దండుగా సంక్షేమ పథకాలు

రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పింఛన్ కానుక కింద అభాగ్యులకు అందించే పింఛన్ మొత్తాన్ని రూ.2750లు నుంచి రూ.3వేలకు పెంచింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి అవ్వా తాతల మొముల్లో ఆనందాన్ని చూడాలన్నా సంకల్పంతో ప్రతి ఏ టా పింఛన్ మొత్తాన్ని పెంచుకుంటూ రూ.3 వేల పింఛన్ అందిస్తున్నారు. జగనన్న ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ నగదును అందించడంతో వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు చేతుల మీదుగా కొత్తగా మంజూరైన వృద్ధాప్య పింఛన్ 51, వితంతు పింఛన్ 57, వికలాంగ పింఛన్ 19 నగదును లబ్ధిదారులను అందించనున్నారు.

విద్యా సామర్థ్యాలను పెంపుదల టీచర్ల బాధ్యత



సూరప్పగూడెంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ-1 ఈదుపల్లి శ్రీనివాసరావు

భీమడోలు: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపుదల ఉపాధ్యాయులు బాధ్యత అని భీమడోలు ఎంఈఓ-1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సూరప్పగూడెం పాఠశాలను బుధవారం ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో విద్యా సంబంధిత రికార్డులు, రిజిస్టర్లును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను ఆయన పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలందించారు. చిన్నారులకు చక్కని విద్యా బోధించి వారిలో చదువుకునే జిజ్ఞాసను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలన్నారు. పాఠశాలలో నాడు నేడు పథకంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడులకు సర్వ హంగులను సమకూరుతున్నాయన్నారు. ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం ఎండీఎంను పరిశీలించారు. హెచ్‌ఎం నిర్మలకుమారి, టీచర్ మండే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి ఫూలే జయంతి

గణపవరం: దేశంలో మొట్టమొదటి మహిళా పాఠశాలను స్థాపించి, మహిళా విద్యకు పునాదివేసిన ఆదర్శ మహిళ జ్యోతిరావు పూలే అని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. బుధవారం గణపవరం డిగ్రీ కాలేజీలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలపై పూర్తి వివక్ష కొనసాగుతున్న కాలంలో సావిత్రిబాయి మహిళా విద్య కోసం చేసిన కృషి అమూల్యమైనదన్నారు. దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయినిగా ఆమె ఎనలేని కీర్తిప్రతిష్టలు సంపాదించి నేటి తరానికి ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఐక్యుఏసీ కోఆర్డినేటర్ టి.అక్కిరాజు, సోషల్‌వర్క్ అధ్యాపకుడు వెంకట్రావు, మహిళాసాధికార విభాగం కన్వీనర్ స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

భీమడోలులో..

భీమడోలు: బాలికా విద్య కోసం అవిరళ కృషి చేసిన సావిత్రిబాయి పూలే సేవలు మరవలేనివని పలువురు వక్తలు కొనియాడారు.



భీమదోలు: అక్బరున్నీషావలి దంపతులను సత్కరిస్తున్న డీఈవో శ్యాంసుందర్

దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం యూపీ పాఠశాలలో బుధవారం క్రాంతిజ్యోతి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు పాఠశాలలోని మహిళా టీచర్లను ఘనంగా సత్కరించారు. ఎం.స్వర్ణలత, ఎం.విజయకుమారి, ఎం.దుర్గాప్రసాదిని, వై.రూన్సీలక్ష్మీకుమారి, ఎం.రవి భారతి తదితరులను సన్మానించారు. అనంతరం హెచ్‌ఎం ఎస్‌కే మస్తాన్ మాట్లాడుతూ బాలికలు చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. సావిత్రి బాయ్ పూలేను ఆదర్శంగా తీసుకుని కష్టించి చదువుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. తొలుత చిన్నారులు దాసరి చైతన్య కృష్ణకుమార్ సావిత్రి బాయి పూలే గురించి చేసిన ప్రసంగం చూపరులను ఆకట్టుకుంది.

ప్రత్యేక విద్య టీచర్ అక్బరున్నీషావలి సేవలు అభినందనీయం

భీమడోలు: చదువుల తల్లి, క్రాంతిజ్యోతి సావిత్రిబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా విద్యాశాఖాధికారి శ్యాంసుందర్ అన్నారు. ఏలూరులో బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని బుధవారం రాత్రి జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత భీమడోలు ఉన్నత పాఠశాలకు చెందిన ప్రత్యేక విద్య స్కూలు అసిస్టెంట్ ఎండీ అక్బరున్నీషావలి దంపతులను ఘనంగా సత్కరించారు. జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించారు.

ఓటర్ల జాబితాపై అవగాహన

భీమడోలు: దోషరహిత ఓటర్ల జాబితాలను సిద్ధం చేయడమే తమ లక్ష్యమని ఉంగుటూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి అన్నారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీలతో బుధవారం ఓటర్ల జాబితాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలు తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎన్ఎస్‌కే ఖాజావలి మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పారదర్శక ఓటర్ల జాబితాలను సిద్ధం చేసేందుకు రాజకీయ పార్టీలు తమ వంతు సహాయ సహకారాలను అందించాలన్నారు. గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో 10వేల నుంచి 16 వేల వరకు ఓటర్ల నమోదు, సవరణలు తదితర ఆర్జీలు అందాయని, వాటిలో 693 ఆర్జీలు మినహా మిగిలిన వాటిన్నింటిని పరిష్కరించామన్నారు. జనవరి 22న తుది జాబితాలను ప్రచురిస్తామని పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటిపై నిర్ణయం తీసుకుంటున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే తమ బాధ్యత అన్నారు. జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు ప్రతి వారం నియోజవర్గ స్థాయిలో మండలాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. ఒకే ఫోటోలు, వివరాలను కలిగిన వాటిపై పరిశీలించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం తహసీల్దార్లు ఏపీ రమణారావు, సాయిరాజు, లక్ష్మీలు, నియోజకవర్గ ఎన్నికల డీటీ ఎస్.పోతురాజులు, రాజకీయ నాయకులు తుమ్మగుంట భవానీ రంగ, రామకుర్తి నాగేశ్వరరావు, పాము మాన్‌సింగ్, ఆర్.శ్రీనివాసరావు, ఉండవల్లి బాలానందం, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భీమడోలులో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఏలూరు ఆర్డీవో ఎన్ఎస్‌కే ఖాజావలి

ప్రజా సంక్షేమమే జగన్ ధ్యేయం

- ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి
- కొల్లేరు గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర ప్రారంభం

ఏలూరు రూరల్: పేదల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. బుధవారం ఏలూరు రూరల్ మండలం పైడిచింతపాడులో ఆయన ఎమ్మెల్సీ వెంకటరమణతో కలిసి ప్రజా ఆశీర్వాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ విద్య, వైద్యం, సచివాలయ పాలన, సంక్షేమం, ఇళ్ల స్థలాల మంజూరుతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని కొనియాడారు. నాడు - నేడు, ఫీజురీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పథకాలతో పేద పిల్లలను విద్యావంతులను చేస్తున్నారని వివరించారు.

రూ.కోటితో అభివృద్ధి పనులు ప్రారంభం

యాత్రలో భాగంగా పైడిచింతపాడులో నాడు నేడు నిధులు రూ.15 లక్షలతో చేపట్టిన స్కూల్ అభివృద్ధి పనులు, రూ.25 లక్షలతో పూర్తి చేసిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అక్కడ నుంచి ప్రత్తికోళ్లలంకలకు పాదయాత్రగా వెళ్లారు. అక్కడ రూ.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. కొత్త పింఛన్ రూ.3 వేలు లబ్ధిదారులకు అందించారు. సర్పంచ్ ముంగర తిమోతీ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొఠారు రామచంద్రరావు, జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, వైస్ చైర్మన్ విజయబాబు, ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ మండల సరస్వతి, తేరా ఆనంద్, జయమంగళ రామారావు, పెద్దలు మోరు వరదయ్య, కొండలరావు, మోరు సుబ్బారావు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పైడిచింతపాడులో కొత్త పింఛన్లు అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు, ఎమ్మెల్సీ వెంకటరమణ

న్యాయం చేయాలని ఆందోళన

దెందులూరు: మండలంలోని గంగన్నగూడెం, గాలాయగూడేనికి చెందిన మొక్కజొన్న రైతులు అధికారులు తమకు న్యాయం చేయాలంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు, గాలాయగూడెం సొసైటీ చైర్మన్ తోట అచ్చియ్య, గంగన్నగూడెం వైఎస్సా ర్‌సీపీ నాయకులు ముసునూరి శివ, తోట వెంకన్న ఆందోళన చేశారు. బుధవారం బాధిత రైతులు పౌల్ట్రీ యజమాని వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పౌల్ట్రీ యజమానికి తాము మొక్కజొన్న అమ్మామని, ఆ యజమాని ఎవరికి డబ్బులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. బాధిత రైతులు తోట శ్రీనివాసరావు, మట్టా సాంబశివరావు, నేరేళ్ల సత్యనారాయణ, తోట జయరాజు, అక్కినేని మహేష్ సొమ్ములు ఇవ్వలేదన్నారు. తమకే కాకుండా మరి కొంత మంది రైతులకు కూడా ఈ పౌల్ట్రీ యజమాని డబ్బులు ఇవ్వాల్సి ఉందని అధికారులు జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం లక్ష్మీపురంలోని పౌల్ట్రీ వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. అనంతరం న్యాయం చేయాలని ఎమ్మెల్యే అబ్బాయ్యచౌదరి, ఏపీ ఆయిల్ ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు కలిశారు. తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే తాము తోట శ్రీనివాసరావుకు మాత్రమే బాకీ ఉన్నామని మిగిలిన ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని పౌల్ట్రీ యజమాని చెప్పడం గమనార్హం.

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో "శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్" గా పిలువబడేది, ఎన్‌సిఎల్‌టి బెంచ్-II చెన్నై, తేది.09-11-2022 యొక్క ఉత్తర్వుల ప్రకారం శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌లో విలీనమైనది మరియు శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌గా మార్చబడినది) మరియు ఆ తర్వాత (30-11-2022 తేదీ నాటి కార్పొరేట్ ఫైనాన్స్ మంత్రిత్వ శాఖ లేఖ ద్వారా) శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా తిరిగి పేరు పెట్టుటకు ఆమోదం పొందిన మేము కంపెనీల చట్టం, 2013 క్రింద రిజిస్టర్డు కంపెనీ అయి ఉన్నాము మరియు శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032 వద్ద తన రిజిస్టర్డు ఆఫీసును మరియు శాఖా కార్యాలయాన్ని పాలకొల్లు వద్ద కలిగి, నాన్ - బ్యాంకింగ్ ఫైనాన్స్ బ్యాంకింగ్ బిజినెస్‌ను నడుపుటకు ఆర్‌బిఐ వద్ద కూడా రిజిస్టర్డై ఉన్నాము.

ఋణగ్రహీతలు/సహ-ఋణగ్రహీతలు/హామీదార్లు/ దిగువ తెలుపబడినవారు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదీల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు/హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 3తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసుల స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోగా చెల్లింపు తేదీ వరకు నోటీసులలో తెలిపిన మొత్తంపై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతోపాటు నోటీసులలో తెలిపిన మొత్తం మరియు ఆనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదార్లు/తనఖా ఋణగ్రస్తులను కోరుతూ SARFAESI చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదీలలో డిమాండ్ నోటీసులు జారీ చేశారు.

వారి చివరిగా తెలిపిన చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందచేయబడక తిరిగి వచ్చినందున సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

పైన చెప్పబడిన పరిస్థితుల దృష్ట్యా ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోగా భవిష్యత్ వడ్డీ మరియు వర్తించు ఛార్జీలతో పాటు పైన తెలిపిన విధంగా బకాయి మొత్తాలను చెల్లించవల్సిందిగా పైన తెలిపిన ఋణగ్రహీతలు, సహ-ఋణగ్రహీతలు మరియు/లేదా వారి గ్యారంటార్ల (వర్తించినచోట)కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది లేనిచో, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(4) క్రింద మరియు ఇందులో వర్తించు నిబంధనల క్రింద ఋణగ్రహీతలు మరియు తనఖా ఋణగ్రస్తుల యొక్క సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీనత చేపట్టడంతో కలుపుకొని సెక్యూర్డ్ అసెట్స్ మీద ఈ నోటీసు తేదీ నుండి 60 రోజుల అనంతరం తదుపరి చర్యలు చేపట్టబడును. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) క్రింద, సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ముందస్తు వ్రాత పూర్వక సమ్మతి లేకుండా నోటీసులో తెలిపిన అతని సెక్యూర్డ్ అసెట్స్‌ను అమ్మకం, లీజు లేదా మరేదేని రూపంలో ఏ ఋణగ్రహీతా బదిలీ చేయరాదని గమనించగలరు.